# తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

## గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం

## ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సిఎం



**హైదరాబాద్,మార్చి28(జర్నలిస్ట్ వార్త):**



ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్-2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# ముగిసిన వార్డు సభ్యుల తొలి విడత శిక్షణ

## గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి





**తల్లాడ/మార్చి28(జర్నలిస్ట్ వార్త):**
మండల కేంద్రంలోని రైతు వేదికలో తొమ్మిది గ్రామ పంచాయతీల వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న తొలి విడత శిక్షణా కార్యక్రమాలు శనివారం విజయవంతంగా ముగిశాయి. వారం రోజుల పాటు సాగిన ఈ శిక్షణ ముగింపు వేడుకలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కోర్స్ కో-ఆర్డినేటర్ అంబటి శ్రీధర్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వార్డు సభ్యులు ఈ వారం రోజుల్లో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సర్పంచులు, వార్డు సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వార్డు సభ్యులకు ఎంపీడీఓ చేతుల మీదుగా ధృవీకరణ పత్రాలు, షీల్డ్స్ అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరుతూ అందరికీ జనపనార బ్యాగులను పంపిణీ చేశారు. తమను గుర్తించి ప్రత్యేక శిక్షణ కల్పించినందుకు పలువురు వార్డు సభ్యులు మండల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఏనుగు సురేష్ బాబు, మండల వ్యవసాయాధికారి తాజుద్దీన్, వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రత్యేక శిక్షకులు జొన్నలగడ్డ పరశురాం, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

# భూ రీ సర్వే పనుల్లో వేగం పెంచాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద -క్షేత్రస్థాయిలో భవానీకుంట తండాలో సర్వే పనుల పరిశీలన

## వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో 6,379 ఎకరాల సర్వే పూర్తి -పొరపాట్లు లేకుండా జియో కోఆర్డినేట్లతో మ్యాపింగ్ చేయాలని ఆదేశం







**వర్ధన్నపేట/మార్చి 28(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీ సర్వే (నక్ష) కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలోని భవానీకుంట తండాలో సాగుతున్న నక్ష సర్వే పనులను ఆమె స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
పంట పొలాల్లో పర్యటించిన కలెక్టర్, సర్వే బృందాలు నిర్వహిస్తున్న భూముల సరిహద్దుల కొలతలు, రికార్డుల నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రోన్ సర్వే, జియో కోఆర్డినేట్లు వంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగించి భూముల హద్దులను ఖచ్చితత్వంతో నిర్ధారించాలని సూచించారు. భూ వివాదాల పరిష్కారానికి, యాజమాన్య హక్కుల స్పష్టతకు ఈ సర్వే ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. అనంతరం వర్ధన్నపేట ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్వే గణాంకాలను వెల్లడిస్తూ మున్సిపాలిటీ పరిధిలోని 10,240 ఎకరాల వ్యవసాయ భూమికి గాను, ఇప్పటివరకు 6,379 ఎకరాల రీ సర్వే పూర్తయిందని తెలిపారు. మొత్తం 4,652 ఇళ్లకు సర్వే ప్రక్రియ పూర్తయింది. పట్టణ పరిధిలోని 158 బ్లాకులకు గాను, 102 బ్లాకుల్లో పనులు ముగిశాయని, మిగిలిన బ్లాకుల్లో పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఆర్డీవో సుమ, తహసిల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ , ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ గుత్తాధిపత్యం వద్దు..


# చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దు.

## అసోసియేషన్ అనుమతి లేకుండా కొత్త గోదాములు పెడితే సహించం -ఒక్కటైన వరంగల్ జంట నగరాల స్క్రాప్ వ్యాపారులు

## ముప్పులో వందలాది కుటుంబాల జీవనోపాధి -మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు వినతి



**వరంగల్ బ్యూరో/ మార్చి 28(జర్నలిస్ట్ వార్త):**
వరంగల్-హనుమకొండ-కాజీపేట జంట నగరాల్లో ఏళ్ల తరబడి సాగుతున్న పాత ఇనుము, ప్లాస్టిక్, వేస్ట్ పేపర్ వ్యాపార రంగంపై కార్పొరేట్ నీడలు కమ్ముకుంటున్నాయి. బహుళజాతి సంస్థలు, ఇతర నగరాల డీలర్లు ఇక్కడ అడుగుపెడితే స్థానిక చిరు వ్యాపారులు రోడ్డున పడతారని ది గ్రేటర్ వరంగల్ ఓల్డ్ ఐరన్, ఎంప్టీ బాటిల్, ప్లాస్టిక్ స్క్రాప్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్' గళమెత్తింది. శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు.
ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పల్లకొండ ప్రభాకర్, ఉపాధ్యక్షులు పాలకుర్తి సారంగపాణి, ప్రధాన కార్యదర్శి కటకం వేణుగోపాల్ మాట్లాడుతూ జంట నగరాల్లో దాదాపు 100కు పైగా స్క్రాప్ షాపులు ఉన్నాయి. వీటిపై ఆధారపడి వందలాది కుటుంబాలు, హమాలీలు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికే పోటీ ప్రపంచంలో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ఇప్పుడు హైదరాబాద్‌కు చెందిన పెద్ద డీలర్లు, కార్పొరేట్ సంస్థలు వరంగల్‌లో గోదాములు ఏర్పాటు చేసేందుకు కుట్ర పన్నుతున్నాయి. ఇది మా పొట్ట కొట్టడమే" అని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారుల ప్రయోజనాల దృష్ట్యా సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అసోసియేషన్ ముందస్తు అనుమతి లేకుండా వరంగల్ పరిధిలో ఎవరూ కొత్తగా హోల్‌సేల్ లేదా రిటైల్ గోదాములు, దుకాణాలు ఏర్పాటు చేయకూడదు.
నిబంధనలు అతిక్రమించి షాపులు పెడితే సహించేది లేదని, అసోసియేషన్ పరంగా తీవ్రంగా అడ్డుకుంటామని హెచ్చరించారు.
చిన్న వ్యాపారులను రక్షించుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు.
వ్యాపారుల సమస్యను అసోసియేషన్ ఉపాధ్యక్షులు, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి సమర్థించారు. వ్యాపారుల పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర అటవీ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు నాయకులు తెలిపారు. స్థానిక వ్యాపారులను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి యాదా విజయ్, ఉప కార్యదర్శి యాదా సత్యం, అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రి.నెం. 471/2009
ది గ్రేటర్ వరంగల్ ఓల్డ్ ఐరన్, ఎంప్టీ బాటిల్స్, వేస్ట్ పేపర్ ప్లాస్టిక్ స్క్రాప్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్
(వరంగల్ - హన్మకొండ - కాజీపేట)
The Greater Warangal Old Iron, Empty Bottles, Waste Paper, Plastic Scrap Marchents Welfare Association
తేది : 28-03-2026
పత్రికా ప్రకటన
[illegible]

# కన్నపేగుతో కాల్వలోకి..

## ముక్కుపచ్చలారని కుమారుడితో తల్లి ఆత్మహత్య

### -ఎస్సారెస్పీ కెనాల్‌లో దూకిన కళ్యాణి, శ్రియన్స్

### దొరకని ఆచూకీ.. గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు -వర్ధన్నపేటమండలంలో విషాదఛాయలు




**వర్ధన్నపేట/మార్చి 28(జర్నలిస్ట్ వార్త):**
ఆ దంపతుల మధ్య తలెత్తిన చిన్నపాటి గొడవ ఓ నిండు ప్రాణాన్ని, చిగురుటాకులాంటి పసికందును కాల్వ పాలు చేసింది. కన్నపేగుపై మమకారాన్ని చంపుకోలేకనో ఏమో కానీ, తాను వెళ్తూ ఆ పసివాడిని కూడా తనతో పాటే తీసుకుపోయింది ఆ తల్లి. వర్ధన్నపేట మండల పరిధిలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం. కట్ర్యాల గ్రామానికి చెందిన మేకల లింగయ్య చిన్న కుమార్తె కళ్యాణి (24)ని స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. కళ్యాణి భర్త పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరికి మూడేళ్ల కుమారుడు శ్రియన్స్ ఉన్నాడు. ప్రస్తుతం ఈ దంపతులు వరంగల్‌లో నివాసముంటున్నారు. అయితే, గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన కళ్యాణి, శనివారం కుమారుడితో కలిసి పుట్టింటికి వచ్చింది.
గ్రామానికి వచ్చిన కళ్యాణి. అందరూ చూస్తుండగానే ఉప్పరపల్లి క్రాస్ సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్దకు చేరుకుంది. కెనాల్ కట్టపై తనతో పాటు కుమారుడి చెప్పులను విడిచిపెట్టి, బిడ్డను హత్తుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి దూకేసింది. కాల్వ గట్టుపై ఉన్న చెప్పులను గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఆ చెప్పులను చూసి కళ్యాణి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

**కొనసాగుతున్న గాలింపు చర్యలు**

సమాచారం అందుకున్న వర్ధన్నపేట పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. గల్లంతైన తల్లి, కుమారుడి ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గాలింపునకు ఆటంకం కలుగుతోంది. రాత్రి వరకు వెతికినా వారి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.
మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వర్ధన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముక్కుపచ్చలారని బాలుడు తల్లితో పాటు జలసమాధి కావడం గ్రామంలో పెను విషాదాన్ని నింపింది.



